FLASH EDITION
WWW. AMMADAILY.COM
EVENING 5PM
AMMA NEWS డిజిటల్
సోమవారం
15 ఏప్రిల్ 2024



## బీజేపీకి షాక్

కాంగ్రెస్‌లో చేరిన రాథోడ్ బాపురావు
సీఎం రేవంత్ సమక్షంలో చేరిక
అదేబాటలో నిర్మల్ చైర్మన్, ఆదిలాబాద్ వైస్ చైర్మన్

2లో





## ధనాదన్ ధోనీ



## సీబీఐ కస్టడీ కాదు.. బీజేపీ కస్టడీ

రెండేళ్ల నుంచి అవే ప్రశ్నలు
ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు
కవిత తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన కోర్టు

2లో..



## ఫోన్ ట్యాపింగ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి

వెంకట్రామిరెడ్డికి బిగుస్తున్న ఉచ్చు
నేడో రేపో నోటీసులు పంపే అవకాశం

2లో..




## కిషన్ రెడ్డి రైతు దీక్ష

'గజదొంగలు పోయి.. ఘరానా దొంగలు వచ్చే'
మార్పు అన్నారు ఏమి మార్పు జరిగింది
కిషన్ రెడ్డి

2లో..

# సౌత్‌లో హవా



## తెలంగాణలో నెంబర్ వన్

కలిసొస్తున్న రాహుల్ రేవంత్ వేవ్
కేరళ తమిళ నాడులో ఇండియా కూటమి స్వీప్
కర్నాటకలో పెరుగుతున్న బలం
కాంగ్రెస్ మిత్రపక్షాల జోరు..
రాహుల్ కు క్రేజ్.. తేల్చి చెబుతున్న సర్వేలు

లోక్ సభ ఎన్నికల్లో సౌత్ లో కాంగ్రెస్ తన పట్టు నిలుపుకోబోతున్నదని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. ఇండియా కూటమిదే సౌత్ లో అగ్రాసనమని సర్వేలు సూటిగా చెప్పేస్తున్నాయి. కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో ఇండియా కూటమి స్వీప్ చేస్తున్నదని సర్వేలు చెబుతుండగా, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీదే నెంబర్ వన్ స్థానమని చెబుతున్నాయి. కనిష్టంగా 9, గరిష్టంగా 14 వరకు తెలంగాణలో కాంగ్రెస్ గెలుచుకునే అవకాశాలు ఉన్నాయని పలు సర్వేలు చెబుతున్నాయి.

“

కర్నాటకలో కాంగ్రెస్ సీట్లు పెరుగుతున్నాయని అన్ని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తంగా సౌత్ లో ఇండియా కూటమి మీసం మెలేసే ఫలితాలు వస్తాయని ధీమాను వ్యక్తం చేస్తుండగా, నార్త్ లో కూడా మెరుగైన ఫలితాలు సాధిస్తామన్న ధీమాతో ఉంది. ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తాజాగా నిర్వహించిన సమీక్షలో బిజెపికి నార్త్‌లో సీట్లు తగ్గుతున్నాయని, అందుకే సౌత్ పై ఫోకస్ చేస్తోందని.. అప్రమత్తమై బిజెపిని నిలువరించాలని కోరుతున్నారు. మరోవైపు బిజెపి నాయకత్వం మోడీ వేవ్ ప్రాంతాలకు పరిమితం కాలేదని, దేశంలోని ప్రతీమూలలో ఉందని ధీమా ప్రదర్శిస్తోంది.

అమ్మన్యూస్ ప్రతినిధి,
హైదరాబాద్



# బీజేపీకి షాక్

**కాంగ్రెస్‌లో చేరిన రాథోడ్ బాపురావు | సీఎం రేవంత్ సమక్షంలో చేరిక**

**అమ్మన్యూస్, హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీకి బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు షాక్ ఇచ్చారు. సోమవారం ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు రాథోడ్ బాపురావు. అయితే 2023 వరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న రాథోడ్ బాపురావు.. టికెట్ రాకపోవడంతో కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లి అక్కడ కూడా టికెట్ రాకపోవడంతో వెనువెంటనే బీజేపీలో చేరారు. ఆ ఎన్నికల్లో 53,992 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. ఇప్పుడు తిరిగి ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్చార్జిగా ఉన్న మంత్రి సీతక్క ఈ చేరికలో ప్రధాన పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశ్, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆడే గజేందర్, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు ఉన్నారు. అలాగే నిర్మల్ మున్సిపల్ చైర్మన్ జీ ఈశ్వర్ కూడా సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ కూడా సీఎంను మర్యాద పూర్వకంగా కలిశారు. కంది శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో తన అనుచరులతో కలిసి త్వరలో కాంగ్రెస్‌లో చేరుతానని ఆయన ప్రకటించారు.




# కిషన్ రెడ్డి రైతు దీక్ష

**'గజదొంగలు పోయి.. ఘరానా దొంగలు వచ్చే'**

**మార్పు అన్నారు ఏమి మార్పు జరిగింది**

**కేసీఆర్ కుటుంబం పోయి.. సోనియా కుటుంబం వచ్చింది**

**ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వానికి శ్రద్ధ ఉందా**

**రేవంత్ మాట నమ్మి రైతులు రుణాలు తీసుకున్నారు**

**రుణమాఫీ ఎందుకు చేయలేదో చెప్పాలి**

**బీజేపీ కార్యాలయంలో కిషన్ రెడ్డి రైతు దీక్ష**

**అమ్మన్యూస్, హైదరాబాద్:** రాష్ట్రంలో ఇంకా రుణమాఫీ ఎందుకు చేయలేదో రైతులకు సమాధానం చెప్పాలని కేంద్ర మంత్రి, బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్ డిమాండ్ చేశారు. రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దీక్ష చేపట్టారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయనకు దీక్షకు దిగారు. పార్టీ శ్రేణులతో కలిసి కిషన్‌రెడ్డి చేపట్టిన దీక్ష మధ్యాహ్నం మూడు గంటల వరకు కొనసాగుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. 2 లక్షల రైతు రుణమాఫీ, రైతు భరోసా అందజేయాలని అన్నారు. అలాగే, మేనిఫెస్టోలో చెప్పినట్టుగా రైతు కూలీలందరికీ 12 వేల రూపాయలు ఇవ్వాలని పేర్కొన్నారు. వరికి 5 వందల రూపాయలు బోనస్ అందించాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల దెబ్బతిన్న పంటలతో నష్టపోయిన రైతులకు 25 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. ఎన్నికల్లో రైతులపై హామీల వర్షం కురిపించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదని కిషన్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మాటలకే కానీ చేతలకు కాదని ధ్వజమెత్తారు.


**ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వానికి శ్రద్ధ లేదు..**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీలకు ఎందుకు అమలు చేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. రైతులకు ఇచ్చిన గ్యారంటీల అమలకు ప్రణాళిక ఉందా అని నిలదీశారు. కొత్తగా తీసుకున్న అప్పులకు తాము అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మరి ఇంకా ఆ రుణమాఫీ ఎందుకు చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి మాటలు నమ్మి రైతులు రుణాలు తీసుకున్నారని చెప్పారు. పంట కోత సమయంలో రైతుల వద్ద డబ్బులు లేవన్నారు. రైతులకు బ్యాంక్‌లు రుణాలు ఇవ్వడం లేదని తెలిపారు. బీఆర్ఎస్ తెలంగాణ ప్రజలను వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. గజదొంగలు పోయి.. ఘరానా దొంగలు వచ్చారని దుయ్యబట్టారు. మార్పు అన్నారు కానీ కేసీఆర్ కుటుంబం పోయి.. సోనియా గాంధీ కుటుంబం వచ్చిందని కామెంట్స్ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వానికి శ్రద్ధ లేదని, తెలంగాణలో వసూలు చేసి ఢిల్లీలో ఇవ్వడానికి సమయం ఉంటుందని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు.

# సీబీఐ కస్టడీ కాదు..
# బీజేపీ కస్టడీ

| రెండేళ్ల నుంచి అవే ప్రశ్నలు | ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు | కవిత తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన కోర్టు | ఈ నెల 23 వరకు జ్యుడీషియల్ రిమాండ్ పొడిగింపు | విచారణకు కవిత సహకరించడం లేదు: సీబీఐ |
|---|---|---|---|---|

**అమ్మన్యూస్, ఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అరెస్టై సీబీఐ కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరోసారి చుక్కెదురైంది. ఆమెకు ఈ నెల 23 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ.. రౌస్ అవెన్యూ కోర్టు తీర్పునిచ్చింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు కవితను మరోసారి తీహార్ జైలుకు తరలించారు. అయితే కవిత సీబీఐ కస్టడీ ముగియడంతో సోమవారం ఉదయం ఆమెను ప్రత్యేక కోర్టులో సీబీఐ న్యాయమూర్తి ముందు అధికారులు హాజరు పరిచారు. ఈ సందర్భంగా కోర్టుకు సీబీఐ అధికారులు వాదనలు వినిపించారు. సాక్ష్యాలను కవిత ముందు పెట్టి విచారించామని తెలిపారు. ఆమె విచారణకు సహకరించలేదని, కవితను విచారించేందుకు మరింత సమయం కావాలని న్యాయస్థానాన్ని కోరింది. అందుకోసం మరో 14 రోజులు కస్టడీ పొడిగించాలని



సీబీఐ కోరింది. ఈ తరుణంలోనే కోర్టు 9 రోజుల కస్టడీకి అనుమతించింది. దీంతో ఈనెల 23వ తేదీ వరకు జ్యుడీషియల్ కస్టడీలో ఉండనున్నారు.

**కవితపై ఆరోపణలు..**

మూడు రోజుల కస్టడీకి కవిత సహకరించలేదని సీబీఐ రిమాండ్ రిపోర్టులో ఆరోపించింది. శరత్ చంద్ర రెడ్డి దగ్గర నుంచి తీసుకున్న రూ. 14 కోట్లపై కవిత తప్పుదోవ పట్టించేలా జవాబులు చెబుతున్నారని తెలిపింది. లేని భూమి ఉన్నట్లుగా చూపి అమ్మకానికి పాల్పడటంపై ఆమె ఎలాంటి సమాధానం ఇవ్వలేదని చెప్పింది. మాగుంట శ్రీనివాసులు రెడ్డి, గోరంట్ల బుచ్చి బాబు, శరత్ చంద్ర రెడ్డి, విజయ్ నాయర్ మీటింగ్‌లపై ప్రశ్నించినట్లు తెలిపింది. దర్యాప్తును, సాక్ష్యులను కవిత ప్రభావితం చేయగల వ్యక్తి అంటూ సీబీఐ పేర్కొంది. ఆధారాలు కూడా ధ్వంసం చేసే అవకాశం ఉందని సీబీఐ రిమాండ్ రిపోర్టులో ఆరోపణలు చేసింది.

**ఇది బీజేపీ కస్టడీ: కవిత**

మరోవైపు కోర్టు ఆవరణలో ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ఇది సీబీఐ కస్టడీ కాదని, బీజేపీ కస్టడీ అంటూ కవిత వ్యాఖ్యలు చేశారు. రెండేళ్లుగా అవే ప్రశ్నలను తిప్పి తిప్పి అడుతున్నరంటూ ఆమె పేర్కొన్నారు. బయట బీజేపీ నేతలు మాట్లాడిన మాటలనే సీబీఐ తమను అడుగుతుందన్నారు. వాళ్లకు కొత్తగా అడిగేందుకు ఏం లేదని కవిత వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో కవితపై ప్రత్యేక కోర్టు జడ్జి కావేరీ బవేజా ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు ఆవరణలో మీడియాతో మాట్లాడటంపై సీరియస్ అయ్యారు. జర్నలిస్టులు ప్రశ్నలు అడిగినా ఎలా మాట్లాడతారు అంటూ ఆగ్రహం వ్యక్తపరిచారు. ఇంకోసారి ఇలా మాట్లాడవద్దు అంటూ వార్నింగ్ ఇచ్చారు. ఇక రెగ్యులర్ బెయిల్‌పై ఈ నెల 16న విచారణ జరగనుంది.

# ఫోన్ ట్యాపింగ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి

**(అమ్మన్యూస్, హైదరాబాద్):** ఎన్నికల ముందు మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి ఉచ్చు బిగుస్తోంది. ఫోన్ ట్యాపింగ్‌లో కీలక పాత్ర పోషించడమే ఇందుకు కారణం. దీంతో గులాబీ దళపతి కేసీఆర్‌కు మరో తలనొప్పి ఎదురైంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కేసీఆర్‌కు కంటి మీద కునుకు లేకుండా చేస్తుందనే చెప్పాలి. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తవ్వుతున్న కొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇవన్నీ బీఆర్ఎస్ నేతల చుట్టూనే తిరుగుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ రాధాకిషన్‌రావును పోలీసులు విచారిస్తున్న సంగతి తెలిసిందే. ఈ విచారణలో తాజాగా వెంకట్రామిరెడ్డి పేరు బయటకు రావడం సంచలనంగా మారింది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నేతల డబ్బును రవాణా చేయడంలో రాధాకిషన్ రావు కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ క్రమంలో వెంకట్రామిరెడ్డికి చెందిన డబ్బునే ఎక్కువగా తరలించినట్లు తేలింది. ఈ డబ్బు తరలించేందుకు ఓ ఎస్సైకి రాధాకిషన్ తప్పుడు సమాచారమిచ్చి బురిడీ కొట్టించినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఎన్నికల సొమ్ము అని చెప్పకుండా అత్యవసర పరిస్థితుల కోసమని ఎస్సైని వాడుకుని పోలీసు వాహనాల్లో ఈ డబ్బు తరలించినట్లు తేలింది. రాధాకిషన్ సూచనతోనే ఆ ఎస్సై సికింద్రాబాద్‌లోని ఓ ప్రముఖ ఆసుపత్రిలో విశ్రాంత ఎస్పీ దివ్యచరణ్ రావును కలిశారని తేలింది. రాణిగంజ్, అఫ్జల్‌గంజ్ నుంచి రూ.కోటి చొప్పున తీసుకొచ్చి



దివ్యచరణ్‌కు అప్పగించారు. ఇలా కొన్నిసార్లు చేశారు. వెంకట్రామిరెడ్డి తనకు బాల్య స్నేహితుడు కావడంతోనే ఆయన డబ్బును తరలించినట్లు రాధాకిషన్ విచారణలో ఒప్పుకున్నారు. అయితే ఈ డబ్బు ఎక్కడిది? హవాలా సొమ్ము ఉందా? అనే కోణంలో పోలీసులు విచారించనున్నారు. ఈ మేరకు వెంకట్రామిరెడ్డికి నోటీసులు పంపించే అవకాశం ఉంది. మరో ఏడాది సర్వీస్ ఉండగానే కలెక్టర్ పదవికి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరిన వెంకట్రామిరెడ్డి... ఆ తర్వాత ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా గెలిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మెదక్ నుంచి బీఆర్ఎస్ క్యాండిడేట్‌గా పోటీ చేస్తున్నారు. ఇప్పుడీ ఫోన్ ట్యాపింగ్ ఉచ్చుతో వెంకట్రామిరెడ్డికే కాకుండా బీఆర్ఎస్ పార్టీకి భారీ ఎత్తున డ్యామేజీ జరుగుతుందనే ప్రచారం జరుగుతోంది.

## రాహుల్ ప్రధాని కావడం ఖాయం

**మోదీ వచ్చాకే తులం బంగారం రూ.75వేలైంది**

**పేదలకు అందని ద్రాక్షలా మారింది కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ఫైర్**

**(అమ్మన్యూస్, హైదరాబాద్):** ప్రధాని మోదీ పాలనలోనే బంగారం పేదలకు అందని ద్రాక్షలా మారిందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. జగ్గారెడ్డి సోమవారం మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశాన్ని నాశనం చేసిందని మండిపడ్డారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ అంటే.. ఉన్న అప్పులను డబుల్ చేయడమేనని ఎద్దేవా చేశారు. శ్రీరాముడి పేరు చెప్పి పబ్లిక్‌ను పరేషాన్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో నిత్యసరాల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తున్నారని ఫైర్ అయ్యారు. 2014లో తులం బంగారం 28 వేలు ఉంటే.. 2024లో మోదీ నాయకత్వంలో తులం బంగారం రూ.75 వేలకు చేరుకుందని.. మహిళలు ఆలోచన చేయాలని సూచించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్‌ను 15 ఎంపీ సీట్లలో గెలిపించబోతున్నారని అన్నారు. దేశానికి ప్రధాని అయ్యే అర్హత రాహుల్ గాంధీకే ఉందని అన్నారు.

## గాంధీ హెలికాప్టర్‌లో తనిఖీలు

**ఉదయనిధి స్టాలిన్ ఛాపర్‌లోనూ...**

**అమ్మన్యూస్, హైదరాబాద్ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రయాణించిన హెలికాప్టర్ లో ఎన్నికల అధికారులు తనిఖీలు నిర్వహించారు. రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారం నిమిత్తం తమిళనాడుకు వెళ్లారు. సోమవారం ఉదయం కర్ణాటకలోని మైసూరు నుంచి తమిళనాడులోని నీలగిరికి హెలికాప్టర్లో చేరుకున్నారు. నీలగిరిలో రాహుల్ గాంధీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ల్యాండ్ అయిన తర్వాత ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఇక, రాహుల్ గాంధీ నీలగిరి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్న డీఎంకే అభ్యర్థి ఏ రాజా. తరపున ప్రచారం నిర్వహించేందుకు అక్కడికి వెళ్లారు. తమిళనాడు ముఖ్యమంత్రి కుమారుడు, మంత్రి ఉదయనిధి స్టాలిన్ నీలగిరిలో ల్యాండ్ అయిన తరువాత ఆయన హెలికాప్టర్ ను కూడా ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. ఉదయనిధి స్టాలిన్ కూడా తమ పార్టీ అభ్యర్థి ఏ రాజా తరపున ప్రచారం చేసేందుకు అక్కడికి వెళ్లారు. రాహుల్ గాంధీ నీలగిరి నుంచి కేరళలోని వయనాడ్ కి వెళ్లనున్నారు. రాహుల్ గాంధీ ప్రస్తుతం వయనాడ్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే.

## సొంత గూటికి ఏపూరి సోమన్న

**ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సమక్షంలో చేరిక**



**అమ్మన్యూస్, హైదరాబాద్:** బీఆర్ఎస్ నేత, ప్రజాగాయకుడు ఏపూరి సోమన్న కాంగ్రెస్ పార్టీలో చేరారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమక్షంలో ఏపూరి సోమన్న కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముంగిట బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఆయన.. తిరిగి మళ్లీ హస్తం పార్టీలో చేరారు. గతంలో తుంగతుర్తి ఎమ్మెల్యేగా తాను వైఎస్సార్సీపీ నుంచి పోటీ చేయాలని భావించారు. ఆ సమయంలో షర్మిల తన వైఎస్సార్టీపీని కాంగ్రెస్ లో విలీనం చేస్తారని ప్రచారం జరిగింది. ఆ నేపథ్యంలో వైఎస్సార్టీపీకి సోమన్న గుడ్ బై చెప్పారు. షర్మిల పార్టీలో చేరకముందే ఏపూరి సోమన్న కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు కూడా. ఇక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సోమన్న చురుకైన పాత్ర పోషించారు. బడుగు బలహీన వర్గాల బలమైన గొంతుకగా ప్రజాదరణ పొందారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి తన పాటల ద్వారా భారీ మద్దతు కూడగట్టడంలో ఏపూరి సోమన్న కీలకపాత్ర పోషించారు.

## న్యాయవ్యవస్థను కాపాడండి

**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి 21 మంది రిటైర్డ్ న్యాయమూర్తుల లేఖ**

**(అమ్మన్యూస్, హైదరాబాద్):** న్యాయవ్యవస్థను కాపాడాలని కోరుతూ సుప్రీంకోర్టు, హైకోర్టులకు చెందిన 21 మంది రిటైర్డ్ న్యాయమూర్తులు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌కు సోమవారం లేఖ రాశారు. తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడం, బహింగంగా వ్యాఖ్యలు చేసి అవమానించడం ద్వారా కొందరు న్యాయవ్యవస్థను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. అంతేగాక రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం కోల్పోయేలా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇలాంటి చర్యలు న్యాయవ్యవస్థను అగౌరవపరచడమేనని స్పష్టం చేశారు. కాబట్టి ప్రస్తుత పరిస్థితుల్లో న్యాయవ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కోరారు. ఇలాగే జరిగితే ప్రజలు పూర్తిగా చట్టంపై విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు నేతృత్వంలోని న్యాయవ్యవస్థ ఇటువంటి ఒత్తిళ్లకు వ్యతిరేకంగా నిలబడాలని, న్యాయ వ్యవస్థ స్వయంప్రతిపత్తిని రక్షించాలని తెలిపారు. అవినీతి కేసుల్లో కొందరు ప్రతిపక్ష నేతలపై తీసుకున్న చర్యలకు సంబంధించి బీజేపీ, ప్రతిపక్ష పార్టీల మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధం నేపథ్యంలో ఈ లేఖ రాయడం గమనార్హం. సీజేఐకి లేఖ రాసిన 21 మంది న్యాయమూర్తుల్లో నలుగురు సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జీలు. మిగిలిన 17 మంది ఇతర రాష్ట్రాల్లో హైకోర్టుల్లో పని చేసి రిటైరైన వారు ఉన్నారు.

# కాంగ్రెస్ జెండా చేవెళ్లలో ఎగరాలి

**ఎంపీ రంజిత్ రెడ్డి.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన పలువురు**

**అమ్మన్యూస్, హైదరాబాద్ :** చేవెళ్ల గడ్డమీద కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేయాలని చేవెళ్ల ఎంపీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్ రెడ్డి అన్నారు. శంషాబాద్ మండలం మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య మండల పార్టీ ఉపాధ్యక్షుడు జీవన్ గౌడ్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్ గూడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అలానే మాజీ సర్పంచ్ భర్త వెంకటేష్ గౌడ్ తో పాటు 200 మంది టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రంజిత్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. గత పది ఏళ్లలో తెలంగాణ రాష్ట్రం దొరల పాలనలో కొనసాగిందని, గొప్పలు చెప్పడమే తప్ప అభివృద్ధి ఎక్కడా కనపడలేదని కాంగ్రెస్ పార్టీ భారీ ప్రభంజనంతో గెలిచిందని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక గ్యారెంటీల పథకాలని రేవంత్ రెడ్డి తీసుకువచ్చారని 100 రోజుల్లోనే ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందని అన్నారు. రాబోయే రోజులలో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు కావాలంటే, రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీని బలపరచాలన్నారు.



# బీఆర్ఎస్ అంటే అభివృద్ధికి బాటలు వేసిన పార్టీ

**మల్కాజ్‌గిరి గెలుపు మనదే.. రాగిడి లక్ష్మారెడ్డి ప్రచార హోరు**

**అమ్మన్యూస్, మల్కాజ్ గిరి:** మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ప్రచారంలో జోరు పెంచారు. ఎన్నికలకు సమయం దగ్గర పడటంతో ప్రత్యర్థుల కంటే భిన్నంగా ప్రజల్లోకి వెళ్తున్నారు. హామీలు, సమస్యలు తీర్చుస్తానని మాట ఇస్తున్నారు. ప్రతి రోజు సమావేశాలు, రోడ్‌లో పాల్గొని గెలుపే లక్ష్యంగా మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో రాగిడి లక్ష్మారెడ్డి ప్రచారాన్ని మరింత ఉధృతం చేస్తున్నారు. సోమవారం మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని కూకట్ పల్లిలోని శ్రీ రామాలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలో రాగిడి లక్ష్మారెడ్డి, రజనీ పాల్గొన్నారు. ఆ తర్వాత గౌతమ్ నగర్ డివిజన్‌లోని గౌతమ్ నగర్ కమ్యూనిటీహాల్‌లో భైరు అనిల్ అధ్యక్షతన నియోజక వర్గ పార్లమెంటరీ సన్నాహక సమావేశం జరిగింది. ఎన్నికల ఇన్చార్జి మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, గౌతమ్ నగర్ కార్పొరేటర్ మేకల సునీత రాము పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో గెలుపు కొరకు శ్రేణులు ప్రతిష్టాత్మకంగా ఎంతో క్రియాశీలకమైన పాత్రను నిర్వహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నానని వారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామన్న ఆరు గ్యారంటీలు విఫలమైన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మల్కాజ్ గిరి రైల్వే చక్రబంధం నుండి విముక్తి పొందాలంటే, మల్కాజ్ గిరి మరింత అభివృద్ధి చెంది.. మన ప్రాంతం బాగుండాలంటే స్థానికంగా ఉన్న వారికే అవగాహన ఉంటుదని అన్నారు. కాబట్టి మన సమస్యలపై గళం విప్పడానికి మన అభ్యర్థి గెలుపు కీలకమని తెలియచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలిసి లక్ష్మారెడ్డి కూకట్ పల్లి డివిజన్ కార్యకర్తలు సమావేశం పాల్గొన్నారు.




# నిందితులను పట్టిస్తే భారీ నజరానా

**సీఎంపై దాడి కేసులో కమిషనర్ ప్రకటన.. వివరాలు తెలిపిన వారికి 2 లక్షల రివార్డు**

**అమ్మన్యూస్, విజయవాడ:** మేమంతా సిద్ధం బస్సు యాత్రలో సీఎం జగన్ మోహన్ రెడ్డిపై జరిగిన దాడి ఘటన విచారణను బెజవాడ పోలీసులు వేగవంతం చేశారు. ఇప్పటికే ఆరు టీంలను ఏర్పాటు చేసి వివిధ కోణాల్లో విచారణ చేస్తున్నారు. తాజాగా మరో 16 టీంలను ఏర్పాటు చేసిన పోలీసులు కేసుకు సంబంధించి వివిధ కోణాల్లో విచారణ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రిపై దాడి చేసిన వారి నిందితుల వివరాలు తెలిపితే రెండు లక్షల రూపాయల నగదు బహుమతిని ఇస్తామని పోలీసులు ప్రకటించారు. ఎవరు చెప్పినా వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, తమకు సమాచారం ఎవరికైనా తెలిస్తే పోలీసులకు దానిని అందచేయాలని విజయవాడ పోలీసులు కోరారు. దీంతో జగన్ పై దాడి ఘటనపై పోలీసులు సీరియస్ గా తీసుకుని విచారణ చేపట్టినట్లు అర్థమవుతుంది. నిందితులు ఎవరైనా తమకు సమాచారం తెలిస్తే పోలీసు అధికారులకు సంబంధించిన ఫోన్ నెంబర్లకు తెలియజేయాలని కోరారు. ఈ ప్రకటనతో నైనా నిందితుడు ఎవరో దొరుకుతాడని పోలీసులు భావిస్తున్నారు. జగన్ పై దాడి జరిగిన సమయంలో అక్కడ విద్యుత్తు లేకపోవడం, సీసీ టీవీ వైర్లు కూడా కట్ కావడంతో ఈ విధమైన బహుమతిని పోలీసులు ప్రకటించారు. ఇప్పటికే దీనిపై సిట్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది.





# ధనాదన్ ధోనీ

టీమిండియా మాజీ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ ప్లేయర్ ఎంఎస్ ధోనీ సరికొత్త రికార్డు సృష్టించాడు. ఐపీఎల్‌లో ఎదుర్కొన్న తొలి మూడు బంతులను సిక్సర్లుగా మలిచిన తొలి భారతీయ క్రికెటర్‌గా ఎంఎస్ ధోనీ చరిత్ర లిఖించాడు. ఐపీఎల్‌లో భాగంగా ఆదివారం రాత్రి ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్ ఎంఎస్ ధోనీ చెలరేగాడు. ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యా వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో తాను ఎదుర్కొన్న 4 బంతుల్లో 20 పరుగులు బాదాడు. వరుస సిక్సర్లతో వాంఖడే స్టేడియాన్ని మోతెక్కించాడు. చివరి క్షణంలో దూకుడుగా ఆడుతూ.. చెన్నై టార్గెట్ భారీ దిశగా సాగింది. ఆ మూడు సిక్స్ లతో ఇదివరకు టీమిండియా ఆటగాళ్లు ఎవరూ ఈ ఫీట్‌ను సాధించలేకపోయారు. ఇప్పుడు సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఇక ఐపీఎల్ మొత్తం మీద ఈ రికార్డు సాధించిన మూడవ క్రికెటర్‌గా ధోనీ నిలిచాడు.

# నేడు ఎస్ఆర్‌హెచ్ వర్సెస్ ఆర్సీబీ

## రాత్రి 7-30 బెంగళూరు లో మ్యాచ్

**ఐదింట మూడు గెలిచిన హైదరాబాద్**

**ఆరు మ్యాచ్ లాడి ఒకటి మాత్రమే గెలిచిన బెంగళూరు**

**నాలుగో ప్లేస్ లో ఎస్ ఆర్ హెచ్**

**చిట్టచివరి స్థానంలో ఆర్సీబీ**

**క్లిష్టంగా మారిన ప్లే ఆఫ్ ఆశలు**

**అమ్మన్యూస్ ప్రతినిధి :** నువ్వా నేనా అనే రీతిలో ఉత్కంఠంగా సాగుతున్న ఐపీఎల్ 2024 సీజన్-17 లో భాగంగా నేడు మరో ఇంటరెస్టింగ్ ఫైట్ జరగనుంది. రాత్రి 7-30 గంటలకు సొంత మైదానం బెంగళూరు లోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ ,ఎస్ ఆర్ హెచ్ తో తలపడనుంది. ఈ సీజన్ లో ఆర్సీబీ కంటే ఎస్ ఆర్ హెచ్ ఎంతో మెరుగైన ప్రదర్శన కనబరిచింది.ఇప్పటివరకు ఈ టోర్నీలో ఆడిన ఐదు మ్యాచుల్లో చెన్నై, ముంబై, పంజాబ్ లాంటి ధీటైన జట్లతో ఆడి విజయం సాధించి టేబుల్ లో ఫోర్త్ ప్లేస్ లో ఉంది. ఇక ఆర్సీబీ గురించి ఎంత తక్కువ చెబితే అంత మంచిది.ఈ సీజన్ లో కంప్లీట్ ఫెయిల్ ఫర్మామెన్స్ తో జట్టు ఆఖరు స్థానంలో ఉంది. ఆడిన ఆరు మ్యాచుల్లో ఒకే ఒక్కటి పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచులో విజయం సాధించింది.

### దూకుడు మీద ఎస్ఆర్‌హెచ్

ఇటీవలి మ్యాచుల్లో గమనిస్తే హైదరాబాద్ బౌలింగ్ , బ్యాటింగ్ , ఫీల్డింగ్ రంగాల్లో అత్యద్భుతంగా రాణిస్తూ ఆల్ రౌండ్ ఆట తీరుతో ఆకట్టుకుంటోంది. అంతే చాకచాక్యంగా విజయాలను అందుకుంటోంది. ఐపీఎల్ చరిత్రలోనే హయ్యస్ట్ స్కోర్ సాధించిన జట్టుగా రికార్డులకెక్కింది. అదే ఊపుతో గత మ్యాచ్ లో పటిష్ట్ జట్టు సీఎస్కేను సొంత మైదానంలో మట్టి కరిపించింది. అంతే కాదు పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లోనూ సత్తా చాటింది. బ్యాటింగ్ స్టార్స్ ట్రావిస్ హెడ్ ,అభిషేక్ శర్మ , హెన్రిచ్ క్లాసెన్ , ఎయిడెన్ మార్క్రమ్ లు అదరగొడుతున్నారు. ఆల్ రౌండర్స్ అబ్దుల్ సమద్ ,షాబాజ్ అహ్మద్ తో పాటు భువనేశ్వర్ కూడా బ్యాటింగ్ లో రాణించగల సత్తా ఉన్నవారే. టాప్ ఆర్డర్ మొత్తం సక్సెస్ ఫుల్ ఫామ్ లో ఉండి ప్రత్యర్థి జట్లకు చుక్కలు చూపుతున్నారు.ఇక బౌలింగ్ డిపార్ట్ మెంట్ లో కెప్టెన్ పాట్ కమ్మిన్స్ ,స్వింగ్ కింగ్ భువనేశ్వర్ కుమార్ , జయదేవ్ ఉనద్కత్, లెగ్ స్పిన్నర్ మయాంక్ మార్కండే బ్యాట్స్ మెన్ల దూకుడుకు కళ్లెం వేస్తూ విజయాలలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. మ్యాచ్ ఫలితాన్ని మలుపు తిప్పగల బ్యాట్స్ మెన్ ,బౌలర్లు కలిగిన ఆల్ రౌండ్ జట్టుగా హైదరాబాద్ రెండు వరుస విజయాలు సాధించి హ్యాట్రిక్ విజయం పై కన్నేసింది.

### అట్టడుగున ఆర్సీబీ


**ఐపీఎల్ 2024 సీజన్ -17 లో ఆర్సీబీకి ఏదీ కలసి రావడం లేదు. టోర్నీ లో టైటిల్ ఫేవరెట్ జట్టుల్లో ఒకటైన బెంగళూరు వరుస అపజయాలతో అట్టడుగు స్థానానికి చేరింది. జట్టులో మోస్ట్ ఎక్స్ పీరియన్స్ ప్లేయర్స్ ఉన్నప్పటికీ కొందరు ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా ఒంటి చేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగల సత్తా ఉన్న పించ్ హిట్టర్ గ్లెన్ మాక్స్ వెల్ ఆశించిన స్థాయిలో రాణించడంలేదు. ఓపెనింగ్ బ్యాట్స్ మెన్ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసీ ఫామ్ లోకి రావడం కొంత ఆశాజనకం. టాప్ ఆర్డర్ బ్యాట్స్ మెన్ రాణించడం పైనే జట్టు స్కోర్ ఆధారపడుతుంది. చివర్లో కీపర్ అనుజ్ రావత్ ,దినేష్ కార్తీక్ సమయోచితంగా ఆడుతున్నా భారీ స్కోర్స్ సెట్ చేయలేక పోతున్నారు. బ్యాట్స్ మెన్ , ఆల్ రౌండర్లు, బౌలర్లు సమయోచింగా రాణిస్తేనే తిరిగి జట్టు విజయాల బాట పడుతుంది. ఆర్సీబీకి ఇకనుండీ ప్రతీ మ్యాచ్ ఇంపార్టెంటే . అయితే వరుస వైఫల్యాల నేపథ్యంలో టీంలో ఏవైనా మార్పులుండే అవకాశముంది. బహుషా ఈ మ్యాచ్ లో ఒకటి రెండు మార్పులతో బరిలోకి దిగవచ్చు. ఏదేమైనా ఇప్పటికైనా ఆర్సీబీ తిరిగి ట్రాక్ లో పడి విజయాలను అందుకోవాలని ఆ జట్టు ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.**



# మెదక్‌లో బీఆర్ఎస్‌కు బిగ్ షాక్

## కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి

**మైనంపల్లి సమక్షంలో చేరిక.. నీలం మధు గెలుపు ఖాయమని ప్రకటన**



**అమ్మన్యూస్, మెదక్:** ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ ఎదురుదెబ్బ తగిలింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సన్నిహితుడు, నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. మల్కాజ్ గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్, నర్సాపూర్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ నర్సారెడ్డి సమక్షంలో మదన్ రెడ్డి, ఎలక్షన్ రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం భారీ అనుచర ఘనంతో కలిసి మదన్ రెడ్డి గాంధీభవన్‌కు చేరుకున్నారు. గాంధీభవన్ వెలుపల నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి రోహిత్ చౌదరి కండువా కప్పి మదన్ రెడ్డిని, ఎలక్షన్ రెడ్డి లను పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో ఈ ఎంపీ ఎన్నికల వేళ మెదక్ పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీకి ఊహించని విధంగా గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఐదు పర్యాయాలు నర్సాపూర్ శాసన సభ్యులుగా ఎన్నికైన మదన్



రెడ్డికి మెదక్ జిల్లాలో పట్టున్న లీడర్‌గా పేరుంది. మదన్ రెడ్డి తరఫున నర్సాపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి దాదాపు 2వేల మంది నాయకులు, కార్యకర్తలు కూడా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలు, నర్సాపూర్ నియోజకవర్గ సీనియర్, బ్లాక్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖమ్మంలో కమలం

## మోడీ హవా.. తాండ్ర వినోద్ రావు సేవలు

## సంచలనం ఖాయమంటున్న కాషాయ శ్రేణులు

**అమ్మన్యూస్, ఖమ్మం:** ఖమ్మంలో ఈసారి రాజకీయ సంచలనం ఖాయమని కాషాయ శ్రేణులు ధీమాగా ఉన్నాయి. ఓ వైపు దేశ వ్యాప్తంగా మోడీ సునామీ, ఖమ్మంలో మచ్చలేని నాయకుడు తాండ్ర వినోద్ రావు అభ్యర్థిగా నిలపడం కలిసివస్తుందని ఆ పార్టీ అధిష్టానం ధీమా వ్యక్తం చేస్తుంది. అనేక సమీకరణలు పరిశీలించిన అనంతరం తాండ్ర వినోద్ రావు అభ్యర్థిత్వానికి బీజేపీ కేంద్ర పార్టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. క్షేత్రస్థాయి ప్రచారంలో వినోద్ రావు దూసుకుపోతున్నారు. గత ఎన్నికల్లో నిజామాబాద్, కరీంనగర్ వంటి ప్రాంతాల్లో సంచలనం సృష్టించిన బీజేపీ ఈ దఫా ఖమ్మంలో సరికొత్త రాజకీయాలకు కేంద్రంగా మారుతుందని బీజేపీ కేంద్ర నాయకత్వం ధీమాగా ఉంది. ఇతర పార్టీలకు చెందిన హేమహేమీలాంటి నాయకులు బీజేపీ టికెట్ ఆశించినా వారిని కాదని మచ్చలేని నాయకుడు తాండ్ర వినోద్ రావుకే పట్టంకట్టింది. మోడీ కమలం ఖమ్మంలో ఖాయం ఎంపీగా వినోద్ రావు తధ్యమని ఆ పార్టీ శ్రేణులు విశ్వాసం ప్రదర్శిస్తున్నాయి. రోజు రోజుకు పార్టీ గ్రాఫ్ పెరుగుతుందని చెబుతున్నారు.






## తమన్నా రాశి ఖన్నా గ్లామర్ షో

తమన్నా భాటియా , రాశి ఖన్నా కలిసి ఒకే పాటలో చేసిన గ్లామర్ షోతో ఫుట్ టాపింగ్ ప్రోమో సాంగ్ 'పంచుకో' రికార్డులు క్రియేట్ చేస్తోంది. పంచుకో అంటూ ఇద్దరు ముద్దుగుమ్మలు రెచ్చిపోయిన ప్రోమోసాంగ్ హాట్ టాపిక్ గా మారింది. తమన్నా, రాశీఖన్నాల గ్లామర్ ఈ పాటను మరింత అందంగా తీర్చిదిద్దింది. వారి గ్రేస్ ఫుల్ మూమెంట్స్, ముఖ్యంగా హిప్ మూమెంట్స్ చూడటానికి ఒక ట్రీట్‌గా వున్నాయి. ట్రెండీ అవుట్ ఫిట్స్ ధరించి, హీరోయిన్లిద్దరూ అదరగొట్టారు. ప్రోమో సాంగ్‌లో సినిమాలోని కొన్ని ఎక్సయిటింగ్ సన్నివేశాలను కూడా చూపించారు. అత్యంత విజయవంతమైన హారర్ కామెడీ సిరీస్ 'అరణ్మనై' నుంచి నాల్గవ చిత్రం అరణ్మనై 4, తెలుగులో బాక్ పేరుతో వస్తోంది. సుందర్ సి దర్శకత్వంతో పాటు ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో తమన్నా భాటియా, రాశి ఖన్నా హీరోయిన్స్. మేకర్స్ ఇటీవల అన్ని ప్రధాన పాత్రలు ఫస్ట్ లుక్ పోస్టర్‌లను విడుదల ద్వారా ప్రచార కార్యక్రమాలను ప్రారంభించారు. ఈరోజు 'పంచుకో'అనే ప్రోమో సాంగ్ తో వచ్చారు. ఏప్రిల్ 26న థియేట్రికల్ రిలీజ్ జరగనుంది.

# KAMALHASAN



## భారతీయుడు-2 వస్తున్నాడు

### గ్రాండ్ రిలీజ్ డేట్ ప్రకటన

అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేసిన సేనాపతిగా 'భారతీయుడు' చిత్రంలో కమల్ హాసన్ తిరుగులేని విజయాన్ని సాధించారు. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' రానుండటంతో మూవీపై భారీ ఎక్స్‌పెక్టేషన్స్ నెలకొన్నాయి. గ్రిప్పింగ్ కథనంతో ఈ మూవీ మరింతగా ప్రేక్షకులను మెప్పించనుంది. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సేనాపతిగా మరోసారి కమల్ హాసన్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయబోతున్నారంటూ అభిమానులు, సినీ ప్రేమికులు, ట్రేడ్ వర్గాలు సహా అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జూన్‌లో భారీ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. కమల్ హాసన్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, ఎస్.జె.సూర్య, బాబీ సింహ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. డైరెక్టర్ శంకర్ మ్యాజిక్ పై విశ్వవ్యాప్త ఆసక్తి నెలకొంది.